క్లుప్తంగా

కిరాణా దుకాణాలపై దాడులు

● అంబర్, గుట్కా ప్యాకెట్ల పట్టివేత



పోలీసులు పట్టుకున్న అంబర్, గుట్కా ప్యాకెట్లు

కాటారం: మండల కేంద్రంతో పాటు దేవరాంపల్లిలోని పలు కిరాణా దుకాణాల్లో అక్రమంగా విక్రయిస్తున్న నిషేధిత అంబర్, గుట్కా ప్యాకెట్లను పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. కిరాణా దుకాణాల్లో అంబర్, గుట్కా విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించారు. మండల కేంద్రంలోని మూడు దుకాణాలు, దేవరాంపల్లిలోని ఒక దుకాణంలో అంబర్, గుట్కా నిల్వలు గుర్తించి స్వాధీనపర్చుకొని సీజ్ చేసి పోలీస్ స్టేషన్ తరలించారు. వాటి విలువ సుమారు రూ.3.02 లక్షల వరకు ఉంటుందని ఎస్సై తెలిపారు. విక్రయదారులు బీరెల్లి రమేశ్, చౌదరి జాంతారాం, అల్లాడి ప్రవీణ్, అనంతుల రాజసమ్మయ్యలపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి



మాట్లాడుతున్న ఎస్సై అశోక్

మొగుళ్లపల్లి: వినాయక నవరాత్రి ఉత్సవాలు ఎటువంటి సమస్యలు లేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని నిర్వాహకులకు ఎస్సై అశోక్ సూచించారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో మండలంలోని వినాయక ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై వారికి పలు సూచనలు చేశారు. తప్పనిసరిగా పోలీస్ వారి అనుమతి తీసుకోవాలని పోలీస్ శాఖ ఇచ్చే సూచనలు పాటించాలన్నారు.

మండల కమిటీ ఎన్నిక



ఎన్నికైన కమిటీ సభ్యులు

చిట్యాల: కుమ్మర సంఘం మండల కమిటీని శనివారం మండల కేంద్రంలో మండల ఇన్‌చార్జ్ తాటికంటి శంకర్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కానుగుల కొమురయ్య, ఉపాధ్యక్షులుగా కందికొండ రాజు, చిలువేరు సాంబయ్య, ప్రధాన కార్యదర్శిగా పోతుగంటి భిక్షపతి, కోశాధికారి చిలువేరు సంతోష్, సహాయ కార్యదర్శిగా పోతుంటి శంకర్, కార్యదర్శిగా నల్లబెల్లి శ్రీనివాస్, ప్రచార కార్యదర్శిగా సముద్రాల దేవేందర్, సలహాదారులుగా పోతుగంటి రాజలింగు, గోడిశాల రాజు, భాస్కర్, తాటికంటి శ్రీనివాస్‌లను నియమించారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి రైతు మృతి



లక్ష్మీరాజ్యం (ఫైల్)

రేగొండ: ప్రమాదవశాత్తు బావిలో పడి రైతు మృతి చెందిన ఘటన మండలంలోని రేపాక గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రేపాక గ్రామానికి చెందిన కుంట్ల లక్ష్మీరాజ్యం (50) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. ఈ నెల 22న పొలానికి వెళ్లివస్తానని వెళ్లాడు. ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అనుమానం వచ్చి చుట్టూ పక్కల వెతకగా శనివారం బావిలో చెప్పులు తెలియాడుతూ కనిపించాయి. బావిలో దిగి వెతకగా మృతదేహం లభించింది. మృతుడి భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేశ్ తెలిపారు.

పరామర్శ

మంగపేట : కురిసిన భారీ వర్షానికి కమలాపురంలో ఎర్రవాగు వరద ఉధృతితో ముంపునకు గురైన కమలాపురంలోని ఇందిరానగర్, భగత్ సింగ్ కాలనీకి చెందిన బాధితులను బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌బాబు శనివారం పరామర్శించారు. వరద నీరుచేరిన ఇళ్లతో పాటు గోడలు కూలి ధ్వంసమైన పలువురు బాధితుల ఇళ్లను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరదముంపునకు గురై నష్టపోయిన బాధితులను ప్రభుత్వం తక్షణమే ఆర్థికంగా ఆదుకోవాలని, ఇళ్లు కోల్పోయిన నిరుపేదలందరికీ ఇందిరమ్మ గృహాలను నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదే విధంగా కొత్తమల్లూరులో ఇటీవల గాయపడిన నాగేంద్రబాబు, జబ్బోని గూడెంలో ఇటీవల మృతి చెందిన జబ్బ మంగయ్య కుటుంబ భ్యులను లక్ష్మణ్‌బాబు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడే నాగజ్యోతి పరామర్శించారు.

రేషన్ డీలర్లకు అందని కమీషన్

ఐదు నెలలుగా ఎదురు చూపు

● ఇబ్బందులు పడుతున్న డీలర్లు



తాడిచర్ల రేషన్ షాపులో లబ్ధిదారులకు బియ్యం ఇస్తున్న డీలర్ (ఫైల్)

మల్హర్: ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్ కార్డుదారులకు ప్రతీ నెలా బియ్యం పంపిణీ చేస్తున్న రేషన్ డీలర్ల కమీషన్ చెల్లింపుల్లో జాప్యం జరుగుతోంది. కార్డుదారులకు బియ్యం పంపిణీ తర్వాత మరుసటి నెలలో కమీషన్‌ను రేషన్ డీలర్ల ఖాతాలోకి సివిల్ సప్లై కార్పొరేషన్ జమ చేస్తుంది. ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు ఐదు నెలలకు సంబంధించిన కమీషన్‌ను ఇప్పటి వరకు జమ చేయకపోవడంతో రేషన్ డీలర్లు ఎదురు చూస్తున్నారు.

9061 రేషన్‌కార్డులు

మండల వ్యాప్తంగా 19 రేషన్ షాపులకు గాను 9061 రేషన్‌కార్డులు ఉన్నాయి. వీటిలో ఎఫ్‌ఎస్సీ కార్డులు 7750, అంత్యోదయ కార్డులు 1311 ఉన్నాయి. రేషన్ షాపుల ద్వారా ఇప్పటికే ఈ కార్డుదారులకు జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించిన బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేశారు. మరో 8 రోజులు గడిస్తే రేషన్ డీలర్లకు మొత్తం ఐదు నెలలకు సంబంధించిన కమీషన్‌ను ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉంది.

అప్పులు చేస్తున్న డీలర్లు

రేషన్ బియ్యాన్ని నిర్ణీత కాలంలో పంపిణీ చేసేందుకు డీలర్లు అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. బియ్యం పంపిణీ చేసిన తర్వాతే సివిల్ సప్లై శాఖ ద్వారా ప్రభుత్వం కమీషన్ డబ్బులు చెల్లిస్తుంది. బియ్యం రవాణా, దిగుమతి కోసం హమాలీలు, పంపిణీలో వర్కర్లు, దుకాణం అద్దెలు, కరెంట్ బిల్లుల కోసం డీలర్లు అప్పులు చేస్తున్నారు. కమీషన్ రాగానే ఖర్చులు పోగా మిగితా సొమ్ముతో వారి కుటుంబాన్ని పోషించుకుంటారు. ఐదు నెలలుగా కమీషన్ రాకపోవడంతో కుటుంబ పోషణ ఇబ్బందిగా మారి మనోవేదనకు గురవుతున్నారు. కమీషన్ చెల్లించాలని డీలర్లు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

పెండింగ్ కమీషన్ చెల్లించాలి



రేషన్ బియ్యాన్ని రేషన్‌కార్డుదారులకు ఇబ్బందులు కలుగకుండా క్రమం తప్పకుండా పంపిణీ చేస్తున్నాం. ఐదు నెలలుగా కమీషన్ రాకపోవడంతో రూం అద్దె, కరెంట్ బిల్లు, హమాలీలు చార్జీలు చెల్లించలేకపోతున్నాం. ప్రభుత్వం త్వరగా పెండింగ్ కమీషన్‌ను చెల్లించాలి.

\- సురేష్, రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు

ఇబ్బంది పడుతున్నాం..



ఐదు నెలలుకు సంబంధించిన కమీషన్ ప్రభుత్వం నుంచి రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. కమీషన్ రాక కుటుంబాన్ని పోషించుకోవాడానికి అవస్థలు పడాల్సి వస్తోంది.

\- ధనుంజయ్, తాడిచర్ల డీలర్

పనులు త్వరితగతిన పూర్తి చేయాలి



రేగొండ: ఆలయ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

● ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

రేగొండ: మండలంలోని కొడవటంచ ఆలయంలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే సత్యనారాయణరావు అన్నారు. ఆలయ గర్భగుడితో పాటు పరిసరాల్లో నిర్వహిస్తున్న పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే శనివారం పరిశీలించారు. అభివృద్ధి పనులను సకాలంలో నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. అంతకు ముందు బాలాలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

పరామర్శ..

మండలంలోని గూడెపల్లి గ్రామానికి చెందిన సిరికొండ అమృతరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే సత్యనారాయణరావు పరామర్శించారు. సంపత్‌రావు, రవీందర్‌రావు ఉన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలి



భూపాలపల్లి అర్బన్ ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

భూపాలపల్లి అర్బన్: సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలని సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘాల జేఏసీ నాయకులు కోరారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ సభ్యులు దోర్నాల సారయ్య, మడికొండ స్వామి, సుధాకర్ మాట్లాడుతూ.. సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచుతామని ఎన్నికల్లో హామీ ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం 20 నెలలు కావస్తున్న జీతాలు పెంచకపోవడం బాధాకరమన్నారు. జీఓ నంబర్ 22కు గత ప్రభుత్వం గెజిట్ చేయకుండా వదిలేసిందన్నారు. సెప్టెంబర్ 5న హైదరాబాద్‌లోని ప్రజాభవన్ ఎదుట నిర్వహించే కార్యక్రమంలో కోల్‌బెల్ట్ ప్రాంత ఎమ్మెల్యేలు పాల్గొని మద్దతు తెలపాలని కోరారు.

తీర్పు అనుకూలంగా రావాలని పూజలు



పూజలు చేస్తున్న నిర్వాసితులు

మల్హర్: మండలంలోని తాడిచర్ల ఓపెన్‌కాస్ట్ బ్లాస్టింగ్ ప్రాంతానికి 500 మీటర్ల దూరంలో ఉన్న పెద్ద తాడిచర్ల డేంజర్ జోన్ ఇళ్ల సేకరణపై హైకోర్టు నుంచి అనుకూలంగా తీర్పు రావాలని తాడిచర్ల, కాపురం గ్రామాల భూ నిర్వాసితులు తాడిచర్ల వెంకటేశ్వర ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పెద్ద తాడిచర్లలోని తమ ఇళ్లను జెన్‌కో సంస్థ సేకరించాలని ఇప్పటికే హైకోర్టులో కేసు వేసినట్లు తెలిపారు. తమకు అనుకూలంగా రెవెన్యూ డిపార్ట్‌మెంట్ ఇప్పటికే కౌంటర్ దాఖలు చేసినట్లు పేర్కొన్నారు. కౌంటర్ దాఖలు చేయాల్సిన జెన్‌కో సంస్థ మాత్రం రెండు నెలలుగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. ఈనెల 25న హైకోర్టులో కేసు విచారణ ఉన్న జెన్కో సంస్థ నిర్వాసితులకు అనుకూలంగా కౌంటర్ దాఖలు చేయాలని కోరారు. ఈ విచారణ లో భూ నిర్వాసితులకు అనుకూలంగా తీర్పు వెలువడాలని ఆశిస్తూ.. స్థానిక వెంకటేశ్వర స్వామి ఆలయంలో పురోహితుడు ప్రహ్లాద్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ ఇందారపు చంద్రయ్య, కమిటీ సభ్యులు రావుల రాజనర్సు, జంజర్ల సారయ్య, ఇందారపు సరీన్, ఇందారపు అనూష, ఇందారపు ప్రవీ ణ్, ఇందారపు సమ్మయ్య, ముదుతనపల్లి నారాయణ, కన్నూరి శివ, మారుపాక రాకేష్, బూడిద యశోద, బూడిద రాజసమ్మయ్య, ఇందారపు రామస్వామి, కోశాగిరి శివ పాల్గొన్నారు.

మొక్కలు నాటడం అందరి బాధ్యత



మొక్క నాటుతున్న విద్యార్థులతో ఏఈఓ రఘుపతి, ఉపాధ్యాయులు

● ఏఈఓ రఘుపతి

చిట్యాల: మొక్కలు నాటడం అందరి బాధ్యత అని మండల విద్యాశాఖ అధికారి కోడెపాక రఘుపతి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణంలో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని తెలిపారు. ఉపాధ్యాయులు శ్రీరాం రఘుపతి, బొమ్మ రాజమౌళి, నీలిమా రెడ్డి, కల్పన, విజయలక్ష్మీ, ఉస్మాన్ అలీ, రామనారాయణ, సుజాత, శ్రీనివాస్, శంకర్, ఫిజికల్ డైరెక్టర్ సూదం సాంబమూర్తి, మౌనిక, బుజ్జమ్మ పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి



చిట్యాల: వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు



టేకుమట్లలో..

చిట్యాల: రాష్ట్ర ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం మండల అధ్యక్షుడు కానుగుల రఘుపతి, ప్రధాన కార్యదర్శి గోపగాని భాస్కర్ కోరారు. శనివారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పాత పెన్షన్ విధానాన్ని 2004 ఆగస్టు 23న రద్దు చేసినందున పెన్షన్ విద్రోహ దినంగా పాటించినట్లు తెలిపారు. అలాగే సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ షేక్ ఇమామ్ బాబాకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా బాధ్యులు శ్రీరామ్ రఘుపతి, సతీశ్, బుర్ర సదయ్య, మనోహర్, మహేందర్, మధు, ప్రవీణ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

టేకుమట్ల: సీపీఎస్‌ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని కోరుతూ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ విజయలక్ష్మీకి తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కుడికాల శ్రీనివాస్, రమేశ్ శనివారం వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. 2023 ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దు చేయాలన్నారు.

కాచి చల్లార్చిన నీటినే తాగాలి

వెంకటాపురం(కె) : కాచి చల్లార్చిన నీటినే తాగునీటిగా ఉపయోగించాలని వైద్యాధికారి మనోహర్ అన్నారు. శనివారం మండ పరిధిలోని ముత్తారంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు, విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. అనంతరం గ్రా మస్తులకు సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకో వాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పరి సరాల, వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. కార్యక్రమంలో డీపీఎంఓ సత్యనారాయణ, హెచ్‌ఈఓ కోటిరెడ్డి పాల్గొన్నారు.

ఎస్‌ఎస్‌తాడ్వాయి : మండలంలోని బయ్యక్కపేటలో శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. పల్లెదవాఖాన వైద్యాధికారి విజయ్‌కుమార్ గర్భిణీలకు, బాలింతలకు, రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. 55 మందిని పరీక్షించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 24 మందికి మలేరియా, 20 మందికి డెంగీ పరీక్షలు నిర్వహించామని ఎవరికీ కూడా మలేరియా, డెంగీ కేసులు నమోదు కాలేదన్నారు. జ్వరం, జలుబు, దగ్గు ఉన్నవారిని పరీక్షించామన్నారు. ఇంటింటికి సర్వే చేసి గ్రామంలో నీరు నిల్వ ఉన్న ప్రాంతంలో ఆయిల్‌బాల్స్ వేయించామన్నారు. ప్రతి ఇంట్లో పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, పెంకులు పాత కూలర్లు తదితర వాటిలో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు.

సమస్యలు పరిష్కరించని ప్రభుత్వం



మొగుళ్లపల్లి: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



భూపాలపల్లి రూరల్: డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

● బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కీర్తిరెడ్డి

మొగుళ్లపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యలు పరిష్కరించడం లేదని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కీర్తిరెడ్డి తెలిపారు. బీజేపీ మండల అధ్యక్షుడు వేణుగోపాల్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సునీతకు నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కీర్తిరెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గంలో సమస్యలు పరిష్కరించడంలో ఎమ్మెల్యే సత్యనారాయణరావు విఫలమయ్యారని ఆరోపించారు. రహదారులు సరిగా లేవని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో సదుపాయాలు లేక వైద్యం అందడం లేదన్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు, సిబ్బంది లేరని తెలిపారు. ముఖ్యంగా ఇటీవల తరచు జరుగుతున్న ఫుడ్ పాయిజన్ ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. అనంతరం కొర్కిశాల కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చదువు రామచంద్రారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మోరే రవీందర్‌రెడ్డి, నాయకులు దొంగల రాజయ్య, కుమ్మరి సారయ్య, రవికిరణ్, సాయిలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మండలంలోని పలు సమస్యలను పరిష్కరించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దొంగల రాజేందర్ అన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు పుగుజ్జు రాజు ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తసీల్దార్ అంజలిరెడ్డికి శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతి ద్వారా రైతులందరికీ పట్టా పాస్ పుస్తకాలు అందిస్తామని చెప్పి కాలయాపన చేస్తుందని ఆరోపించారు. వర్షాల వల్ల పంటలు నష్టపోయిన రైతులకు ఫసల్ బీమా అమలయ్యేలా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. రైతులకు యూరియా అందించాలని తెలిపారు. గ్రామాల్లో అంతర్గత రోడ్లను నిర్మించాలని, ఆజాంనగర్ నుంచి భూపాలపల్లికి రెండు బస్సులు నడిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బట్టు రవి, కంబాల రాజయ్య, ఊరేటి మునేందర్, జంజర్ల సురేష్, కంచం నరసింహమూర్తి, దామోదర్ రెడ్డి, బాణాల మధుకర్, నల్లా సుభేందర్ రెడ్డి, తాండ్ర హరీశ్, ఆవుల సంతోష్, సిలోజు సాగర చారి పాల్గొన్నారు.

తీగలు వేలాడకుండా చర్యలు



తీగలను సరిచేస్తున్న కేబుల్ ఆపరేటర్

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం పరిధిలో విద్యుత్ పోల్స్‌పై వేలాడే కేబుల్, ఇంటర్నెట్ ఫైబర్ తీగలు వేలాడకుండా కేబుల్ ఆపరేటర్లు చర్యలు తీసుకుంటున్నారు. శనివారం కాళేశ్వరంలో కేబుల్ ఆపరేటర్లు అవసరం లేని ఫైబర్స్ వైర్లను పోల్స్ పైన లేకుండా తీసివేశారు. ఫైబర్ వైర్స్‌ను వేలాడకుండా సరి చేస్తున్నట్లు ఆపరేటర్ మాడిగ నరేష్ పేర్కొన్నారు. తమకు సహకరించిన విద్యుత్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

కాపర్ వైర్ చోరీ

కాటారం: మండలంలోని కాటారం-భూపాలపల్లి మార్గంలో కొత్తపల్లి సమీపంలో జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ నుంచి గుర్తు తెలియని వ్యక్తులు కాపర్‌వైర్‌ను దొంగలించారు. శనివారం ఉదయం అటువైపుగా వెళ్లిన పలువురు గమనించి విద్యుత్ అధికారులకు సమాచారం అందించారు. దీంతో విద్యుత్ అధికారులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా దుండగులు ట్రాన్స్‌ఫార్మర్ పగలగొట్టి అందులోని కాపర్‌వైర్‌ను ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. చోరీపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు అధికారులు తెలిపారు.

ఓటు హక్కు అమూల్యమైనది

● ప్రిన్సిపాల్ నర్సయ్య



కళాశాలలో ఓటు వేస్తున్న విద్యార్థి

కాళేశ్వరం: ఓటు హక్కు అమూల్యమైనదని జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎన్.నర్సయ్య అన్నారు. మహదేవపూర్ మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో శనివారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నర్సయ్య విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. అలాగే ఇంటర్ బోర్డు జూనియర్ కళాశాలలో విద్యార్థులకు (ఎఫ్ఆర్ఎస్) ముఖ గుర్తింపు హాజరు ద్వారా విద్యార్థుల హాజరు పర్యవేక్షణ చేస్తున్నందున కళాశాల విద్యార్థులు కళాశాలకు క్రమం తప్పకుండా హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రీన్‌వుడ్‌లో పాఠశాలలో..

మహదేవపూర్ మండల కేంద్రంలోని గ్రీన్‌వుడ్ పాఠశాలలో మాక్‌పోలింగ్ నిర్వహించారు. ఎస్పీఎల్ పదవికి 10వ తరగతి విద్యార్థి ఎస్.అర్పిత్, ఏఎస్ విభాగంలో 10వ తరగతి విద్యార్థి అస్మితలు గెలుపొందారు. కరస్పాండెంట్ శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపల్ సీహెచ్.శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్ రాజ్‌కుమార్‌లు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా నిజాయితీగా ఓటు వేయాలని సూచించారు.

ఎడ్ల పండుగ సందడి



ఎడ్లను వీధుల్లో ఊరేగిస్తున్న రైతులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో శనివారం పొలాల అమావాస్య సందర్భంగా రైతులు ఎడ్ల పండుగను సందడిగా నిర్వహించారు. ఎడ్లకు అందంగా రంగు రంగుల కలర్లు వేసి, పూల దండలు, నెమలి ఈకలు కట్టి, కాళ్లకు గజ్జలతో డప్పు చప్పుళ్ళ మధ్యలో ఊరేగింపు చేశారు. పాడిపంటలు సమృద్ధిగా పండాలని గ్రామంలోని పోచమ్మ, సమ్మక్క-సారలమ్మ దేవతల గద్దెల చుట్టూ తిరిగి మొక్కులు చెల్లించారు. అనంతరం శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామిని ఎడ్లతో దర్శించుకుని పూజలు చేశారు. రైతులు శ్రీనివాస్, బండి శ్రీనివాస్, గోర మల్లయ్య, గుర్రం కార్తీక్, యాదగిరి, పెంటి కొండయ్య, కాటారం శేఖర్, రేవెల్లి సంతు తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు అమ్మితే చర్యలు



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏఓ శైలజ

వెంకటాపురం(ఎం): ఎంఆర్‌పీ కంటే ఎరువులను అధిక ధరలకు అమ్మినట్లయితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని స్థానిక వ్యవసాయ అధికారిణి శైలజ వ్యాపారస్తులను హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ఇప్ప టి వరకు 1789 మెట్రిక్ టన్నుల యూరియాను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు.